# భిన్న గతులు

"ఈ వెధవ ఇంటర్ పాసు కాకపోయినా బావుండేది. పాసయి ఇప్పుడు అఘోరించాల్సి వస్తోంది. నన్ను ఇంట్లోనూ వుండ నివ్వరు, వెళ్ళిపోతానయ్యా అని, నా మానాన నేను వెళ్ళిపోతే, అక్కడా వుండనివ్వరు. మొన్న మద్రాసు వెళ్తే, ఇప్పుడిక్కడ కొంప మునిగినట్లు టెలిగ్రాం ఇచ్చారు. ఏం? వెంకట్రాయుడి కూతురు కాక పోతే, అతడి జేజి నాయన మరొక డిస్తాడు...". గాఢంగా నిట్టూర్చి బెంచీమీద కూలబడ్డాడు రఘునాథం.

'సరేలే! అయింది కదా నీ ఉపన్యాసం. ఇంక లెయ్! ముందు స్నానం చేయి. ఆనక మీ నాన్నొస్తే నీ కట్టంతా ఆయనముందు పడేద్దువుగాని లేలే! వచ్చి పది నిముషాలన్నా కాలేదు, అప్పుడే ప్రారంభం వర్షం! మీ నాన్న గాలిలా వచ్చి కలుస్తారు. ఇంక ఈ ఇల్లు తుఫానులోపుడకయి వూరుకొంటుంది: ఆం...సరేలే...లేలే' అని ఇక వస్తాడు కదా అని, సుభద్రమ్మ వెనక్కి చూడకుండా, పెరటివేపు వెళ్ళిపోయింది.

రఘు అక్కణ్నుంచి కదల్లేదు. తీవ్రంగా ఆలోచిస్తున్న తత్త్వవేత్త పోజు పెట్టి అలాగే కూర్చుండిపోయాడు. ఆమె కొన్ని నిముషాల తర్వాత మళ్ళీ వచ్చింది. అతడి ముఖంలో తీవ్రతా చికాకూ చూసి ఆమె బెదిరి పోయింది.

"సరే నాయనా! అయినట్లే యింక! ఇంతేనా...ఇలా వుండిపోవడమేనా! వద్దురా బాబూ! ఉద్యోగం రాకపోతే పోయిందిగానీ...నీకు పిచ్చెత్తేలా వుంది. మొన్న లక్ష్మమ్మత్త కొడుకును చూళ్లా! ఏమయ్యాడు...? హారి... శ్రీరామ చంద్రా! అక్కణ్నుంచి కదలవేంరా"

రఘు మొహం మరోవేపు తిప్పుకొన్నాడు. ఆమె మాట్లాడ లేదు.

'సరేలే...ఆయనే రానీలే' అని తిన్నగా నడిచి వెళ్ళి పోయింది.

'అన్నయ్యొచ్చాశాడో' అని ఒక గంతువేసి ఒక అమ్మాయి అన్నయ్య ఒడిలో కూచుంది. ఒకబ్బాయి సంచీ అక్కడే వదిలేసి 'అన్నయ్యా' అంటూ మీద పడ్డాడు. మరో తమ్ముడు వెళ్ళి నిద్దురపోతున్న చెల్లాయిని లేపి తీసుకొచ్చేశాడు. అంత వరకూ గంభీరంగా వుండినవాడల్లా, రఘు వాళ్ళతో కలిసి పోయాడు. అందరికీ తను పట్నంనుంచి తెచ్చిన కేకులు, బిస్కెట్లు, పిప్పరమెంట్లు పంచి పెట్టేశాడు. వాళ్ళందరూ కబుర్లు చెప్పడం ప్రారంభించారు. రఘు ఓపికగా విన్నాడు—

తాము స్కూల్లోనూ, ఊళ్ళోనూ, ఏయే ఘనకార్యాలు చేశారో వివరంగా చెప్పారు. ప్రక్కింటి శేషూను ఓ రోజు ఎట్లా చితక తన్నేశారో విపులంగా వివరించింది ... ఆఁ ఊఁ ... అంటూనే చిన్నమ్మాయి.

ఇవన్నీ చెప్తున్నప్పుడు మాత్రం, అతను నిర్వికారంగా వింటూ కూర్చున్నాడు. అప్పుడప్పుడూ ముఖంలో నవ్వు కనిపిస్తుండటంవల్ల పిల్లలు ఉత్సాహంతోటే చెప్పారు. రఘు

వింటున్నవాడల్లా మధ్యలో హఠాత్తుగా లేచి బట్టలు మార్చుకొని, పెరటి వేపు వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం భోజనం చేస్తున్నప్పుడు వెంకట్రావుగారు వచ్చారు.

అబ్బాయిని అలా చూసి 'ఉదయం బండికేనా రావటం?' అన్నారు. అంతే! ఆ సాయంకాలం వరకూ మరేమీ మాటలు సాగలేదు.

ఎక్కడ మాట్లాడుతాడో అని, రఘు భోజనం చేసి వెళ్ళి పడుకొని నిద్ర నటించాడు. కాసేపటికి నిజంగానే నిద్రపట్టి, నాలుగింటికి గానీ లేవలేదు. నాలుగింటికి లేచి ఊళ్ళోకి వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనం చేస్తున్నప్పుడు కూడా తండ్రీ కొడుకులు మాట్లాడుకో లేదు.

రఘు కన్న ముందే భోజనం చేసి వెంకట్రావు వెళ్ళి బెంచీమీద కూర్చున్నారు. రఘు భోజనం చేసి వస్తూనే మాటల్లో దింపేశారు. ఆయన చెప్తున్నదానికల్లా అతడు 'ఆఁ... సరే...అవును...నిజమే...అలాగే నాన్నా...'అని సమాధాన మిస్తూ వచ్చాడు. 'రేపు ఉదయం అమ్మాయిని చూట్టానికి వెళ్లా' లంటే 'ఊఁ' అని ఊరుకొన్నాడు. సిగ్గు పడుతు న్నట్లుందని ఆయన నవ్వుకొన్నాడు. ఆయన చెప్పడమంతా విని, రఘు ప్రారంభించాడు —

'నాకంతా అయోమయంగా వుంది నాన్నా! నేనా మద్రాసులో చస్తున్నాను. వాడి ఫ్యాక్టరీలో రోజుకు ఇరవై గంటలు పని చేయాలి. ఇంతా పడేడిస్తే వాడిచ్చేది మాసానికి

ముష్టి ఏభై రూపాయలు. దానికే ఎన్ని పాట్లు, ఎన్ని వర్రీస్ ఆ ఫ్యాక్టరీలో! అదో నరకమనుకో నాన్నా! నేనక్కడలా చస్తూవుంటే, మీరు నాకు పెళ్ళి పెళ్ళి అంటారు! పెళ్ళి చేసుకొని ఎవరు సుఖపడాలని? మనం సుఖపడటానికి పుట్టలేదు నాన్నా! సుఖపడుతున్న వాళ్ళు సుఖపడే వాళ్ళు వేరే వున్నారు. వాళ్ళు లక్షణంగా బంగళాల్లో, కార్లతో, నౌకర్లతో, బొచ్చు కుక్కలతో దర్జాగా బ్రతుకుతున్నారు. వాళ్ళ క్రింద నలిగిపోతూ మనం చచ్చిపోతూన్నాం నాన్నా! మా డైరెక్టరు కారు కొన్నాడు మొన్న...కొత్తదిలే...!'

'వరేయ్! నీ ధోరణి యింకా తగ్గలేదూ! ఇంకా డబ్బున్న వాళ్ళని తిడుతూనే వున్నా వన్న మాట. అయితే యిక నువ్వు బాగుపడ్డట్టేలే! వాళ్ళు ఎప్పుడో ఒక నాడు కోపమొచ్చి వెళ్ళి పొమ్మంటారేమోలే! సరే...బాగానే వుంది. మన దురదృష్టానికి మనం మొత్తుకోవాలేగానీ, డబ్బున్న వాళ్ళమీద పడి మొత్తుకుంటే లాభ మేముందయ్యా!...'

'నీకు తెలీదులే నాన్నా! వాళ్ళంతా దోపిడీ చేస్తున్నారు. వాళ్ళ క్రిందపడి మనం నలిగి చస్తున్నాం. వీళ్ళంతా నశించేవరకు దేశం బాగుపడదు; మనకు మంచి రోజులు రావు.'

అబ్బాయి ధోరణి ఆయన కేమీ నచ్చ లేదు.

'సరే...నువ్వలాగే...అనుకొంటూ ఉండు' అని ఆయన లేచి వెళ్ళి పోయారు.

మర్నాడు ఉదయం ఎనిమిదింటికిగానీ రఘునాథానికి మెలకువ రాలేదు. అప్పుడు కూడా వెంకట్రావుగారి మాటలవల్లే మెలకువ వొచ్చింది.

"మావాడు సుబ్బారాయుడూ ఓ మినిస్ట్రయిపోయాడు. అంతా మినిస్టర్లే. అయినా ఇతడికెట్లా తగిలిందీ అని ఈ ఛాన్సు! అతను మినిస్ట్రవుతాడని నేను కలలో కూడా అనుకోలేదు. మేం చదువు కొనేటప్పుడు మా క్లాసుకల్లా ఇతడే మొద్దు. జైలు కెళ్ళిపోయి, ఇప్పుడు తనూ ఒక నాయకుడయి పోయాడు. జైలు నుంచి వచ్చి ఎలెక్షన్స్‌లో గెలిచేశాడు. అప్పటినుంచి గెలుస్తూనే వున్నాడు. కానీ ఇంతవరకూ గొప్పవాడనిపించుకో లేదు. ఆ పార్టీవాళ్ళే అతణ్ని మెచ్చుకోరు. మరి ఎట్లా అయిపోయాడో మినిస్ట్రయి పోయాడు. ఒకసారి మా క్లాసుకంతా లెక్కల్లో అనుకొంటాను; నేను ఫస్టొస్తే, అతడు లాస్టొచ్చాడు ...

'మొదలు పెట్టారూ...!' అంటూ లేచి వచ్చాడు రఘు. 'నీతో నేనా ... ఇదంతా ఈయన చెప్తున్నది? — ' అన్నాడు అమ్మను ఉద్దేశించి.

'ఇంకెవరు వింటారు ...!' అని వెళ్ళిపోయిందామె.

'నా క్లాసుమేట్ మంత్రి అయాడురా ! ఇదిగో...పత్రిక చూస్తే తెలుస్తుంది. ఈరోజు హెడ్‌లైన్ అదే!' అని పత్రిక అందించారాయన.

రఘు రెండు నిముషాలు పత్రికను చూసి ... 'అయితే ఏమంటారూ...' అన్నట్లు చూశాడు.

'చూశావూ...నేను అనుకొంటూనే వున్నాను...వీడు ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకటయిపోతాడని! కానే అయ్యాడు! కాకేం చేస్తాడు?

'మొన్న దార్లో కనిపించాడు. హోటల్లో కాఫీ త్రాగాము. అప్పుడు చెప్పాడు—

'నీ అంతశక్తి వుంటే నేనీపాటికి ఇండియా ప్రధాన మంత్రయిపోయే వాణ్నయ్యా అని'

'అయితే...సుబ్బారాయుడిగారిని అభినందిస్తూ ఓ టెలిగ్రాం యిచ్చేయండి. పాపం సంతోషిస్తారు!' అన్నాడు రఘు.

'అవును...ఎస్...యూ ఆర్ రైట్...' అని ఆయన పత్రికమడిచి పట్టుకొని, గదిలోకివెళ్ళి డబ్బుతీసుకొని, చకచకా బయటికి వెళ్లిపోయారు.

రఘు కాలకృత్యాలు తీర్చుకొని, కాఫీ త్రాగేలోగా ఆయన తిరిగివచ్చేశారు.

'వేగిరం కాఫీత్రాగి బయలుదేరాలి. పదింబావుకే బండి. మళ్ళీ సాయంకాలంవరకూ మరో బండిలేదు. ఈ బండికే వస్తున్నట్లు రాసేశాను—' అన్నారాయన వస్తూనే.

"ఎక్కడికి? ఎందుకు నాన్నా? పెళ్ళి చూపులకేనా మీరు చెప్తున్నది? ఎందుకు నాన్నా మియర్ వేస్ట్...వృధా! నీకొడుక్కు పిల్ల నెవరిస్తారు? డిగ్రీలున్నాయా? మడులున్నాయా? మాన్యాలున్నాయా? ఏమీ లేవే! నువ్వేమో కట్నం కావాలంటావు. ఇంటర్ చదివిన వాడికి పిల్లనిచ్చే ధైర్యవంతు డెవరైనా దొరికిన తర్వాత గదా కట్నం సంగతి..."

'ఓరేయ్! నువ్వు అట్టే వాగబోకు! నువ్వు నేను చెప్పినట్లు చెయ్యి! నాతో ఇక వక్కమాట మాట్లాడవద్దు. అంతే' అన్నారాయన.

పెళ్ళి చూపులకు వెళ్లారు. అక్కడ రఘు అనుకొన్నట్లుగానీ, వెంకట్రావుగారు ఆశించినట్లుగానీ జరగలేదు.

అమ్మాయి నాన్న పేదవాడు. నలుగురు ఆడపిల్లలతండ్రి. ఇంతవరకు ఎవ్వరికీ పెళ్ళి కాలేదు. ఎవ్వరికీ కట్నమిచ్చుకోలేదు.

పిల్లనచ్చితే ఒక ఎకరా పొలం రాసిస్తాడు. ఖర్చులు పెట్టుకొని పెళ్ళి చేస్తాడు. పిల్ల నచ్చకపోతే దారి చూసుకొనిపోతూ వుండొచ్చు నని నిక్కచ్చిగా చెప్పాడాయన. అమ్మాయా రంభ! పేరు జానకి.

ఇంత అందమైన అమ్మాయి, వేయి జన్మాలెత్తినా తన మొహానికి ఎవరూ ఇవ్వ రనిపించింది రఘుకు.

జానకి...బక్క పలుచగా వుండదు కానీ లావుగా కాకుండా, కొంత సన్నగానే వుంటుంది. కొద్దిగా పొడవుగానే వుంటుంది. కోల ముఖం! ఆకర్షించే కళ్ళు. ముఖం స్పష్టంగా వుంది. ముక్కు, చెవులూ అన్నీ తీర్చిదిద్దినట్లు ముచ్చటగా చక్కగా అందంగా వున్నాయి. తెల్లని ఛాయ. మధురమైన కంఠం!

పత్రికలు చదువుతుంది. చూస్తే, తన తత్వానికీ, భావాలకూ సరి పోయేలా కనిపించిం దామె.

ఉదయంవరకు అతను పెళ్ళికి పూర్తిగా విముఖుడు. తన భావి జీవితం సుఖమయం కావాలంటే, తను మరి కొన్నేళ్లు వొంటరిగానే వుండి జీవితంలో స్థిరపడటం శ్రేయస్కరమను కొన్నాడు.

కానీ...తను నిజంగానే, జీవితంలో సుఖపడదలిస్తే, ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకోవటం ఒక్కటే, ఇప్పు డందుకు చక్కని మార్గంగా కనిపించింది.

బయటికొచ్చి వెంకట్రావుగారు అడిగారు 'ఏమంటావూ' అని.

తనకు... నిజంగానే ఇప్పుడు పెళ్ళి చేసుకోవటం ఇష్టంలేదు. కానీ తనకా అమ్మాయి నచ్చింది. మంచి ఉద్యోగం దొరికే వరకు వాళ్లు ఆగేటట్లయితే, తను చేసుకోవడానికి సిద్ధం. ఆ ఎకరా పొలం కూడా అక్కర్లేదు. అదే చెప్పేశాడు రఘు.

ఆయన 'వెధవా' అని ఒక చూపుచూసి లోపలికి వెళ్ళి వాళ్లతో మాట్లాడారు.

*  *  *

రఘు మద్రాసుకు వెళ్ళిపోయాడు. అక్కణ్ణుంచి ఉత్తరాల వర్షం కురిపించాడు. 'నే నిక్కడ పని చేయలేను. ఇది నరకం కాదు. నరకం ఇంత అధ్వాన్నంగా వుండదు. నేను బ్రతకదలచుకొన్నాను. ఇక్కడి కన్న ఇంట్లో మీ తిట్లే నయమని పిస్తోంది.'

తల్లి వచ్చేయమని ఉత్తరం రాయించింది. ఊపిరుంటే ఉప్పమ్ముకోవచ్చు! రఘు ఒకరోజు హఠాత్తుగా తనపెట్టే, బెడ్డింగ్‌తో ఇంట్లో దిగేశాడు. వెంకట్రావుగారు ఏమీ మాట్లాడలేదు. సుభద్రమ్మ 'ఎంత చిక్కిపోయావురా!' అని కళ్ళ నీళ్ళు పెట్టుకొంది.

*  *  *

ఆ ఇంట్లో వాతావరణం తనకు నచ్చకపోవడం వల్లనైతేనేమి, త్వరగా పెళ్ళి చేసుకోవాల నయితే నేమి, రఘు ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నించ సాగేడు. రికమెండేషన్స్ కోసం అతను సోకాల్డ్ గొప్పవాళ్ళ నెవర్నీ ఆశ్రయించ దలచుకోలేదు. అయినా వెంకట్రావుగారు ఊరుకుంటారా? పంచాయితీ బోర్డు సభ్యులు, మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు మొదలు కేంద్ర, రాష్ట్ర మంత్రులవరకుగల నాయకుల చుట్టూ తిరుగుతూ వున్నారు. ఒక్కరూ ఆ ఒక్క మేలూచేసి పుణ్యం మూటకట్టుకో లేదు.

మంత్రి సుబ్బారాయుడు గారిమీద ఆయన ఎక్కువ ఆశ పెట్టుకో లేదు. మంచివాడేగానీ, ఇప్పుడు నెత్తిన కొమ్ములు

మొలిచి వుంటాయనుకొన్నారు. అయినా తరచూ సుబ్బా రాయుడుగారికీ, తనకూ గల సన్నిహితత్వాన్ని గురించి మాట్లాడుతూనే వుంటారు. అందువల్ల ఆ వినేవారికి తనపట్ల గౌరవం పెరుగుతుందని ఆయన ఆశ. ఇంట్లో కూడా చెప్తూ వుంటారు. ఆయన మాటలు ఎవరూ పట్టించుకోరు.

మంత్రి సుబ్బారాయుడిగారిని గురించి ఆయన మాట్లాడు తున్నప్పుడు, ఒకసారి తండ్రీ కొడుకులమధ్య చిన్న ఘర్షణ కూడా జరిగింది.

"సుబ్బారాయుడూ నేనూ ఒక్కటని రోజూ చెప్తూ వుంటారే! మరి మంత్రయిం తర్వాత ఆయన మీ ముఖం చూశాడూ! చిన్నప్పుడెప్పుడో పొరబాటున మీ క్లాసులో కూర్చున్నాడేమో! ఆ పాపానికి ఆయన్ని రోజూ మీ జతలో చేర్చాలా! ఆయన నిజంగానే మీ స్నేహితుడైతే, మీకేమీ సహాయం చేయలేడా? మంత్రి అనుకొంటే చేయలేని దేముంది?" అన్నాడు రఘు.

"ఒరేయ్ నువ్వు అట్టే వాగబోకు. నువ్వు కుర్రకుంకవు. నీకేం తెలుసు, ఆయన పెద్దమనిషని! మేమిద్దరం కలుసుకొని లాభ నష్టాలా చూసుకోవలసింది" అన్నారాయన.

'బావుంది. ఈయనకు మినిష్టర్లంటే చాల గొప్ప తప్పా డభిప్రాయ మున్నట్లుందే! మంత్రులంత వాళ్ళు మంత్రులే! ప్రజలకు వాళ్ళంత శత్రువులు...వుంటా రంటారా?'

"చాల్‌చాలు! నీ వుపన్యాసం మొదలుపెట్టకు. ఆ వెధవ చెత్తపుస్తకాలన్నీ చదివి నీ బుద్ధి చెడిపోయిందిరా!"

"ఆ పుస్తకాలే చదవక పోయివుంటే, నీ కొడుకసలు మనిషే అయ్యేవాడు కాదు."

"ఇంకేమవుతాడు...? ఇప్పుడు మాత్రం ఏ మయ్యావు?... ఏం కాలేక పోయావు...?"

వీళ్ళిద్దరి మాటలు సుభద్రమ్మకు నచ్చలేదు.

'భోజనం చేద్దురులెండి' అంది. ఆయన భోజనానికి లేచారు. రఘు గదిలోకి వెళ్లాడు. ఆయనతో భోజనం చేయడం 'విషంతో' అన్నం కలుపుకొని తినడమనుకొంటాడు రఘు. ఎందుచేతనంటే, ఆయనకు తిట్టడానికి భోజనం అడ్డు రాదు. వెంకట్రావుగారి అమ్మ ఇటీవలి వరకు బ్రతికుండేది. ఆమె తిట్టిన తిట్టు తిట్టకుండా కొన్ని గంటలు ఏకబిగిని తిట్టడంలో మంచి నైపుణ్యం కలిగినది. అదీ ఒక కళే! ఆ కళ ఇప్పుడిప్పుడే వెంకట్రావుగారిలో అభివృద్ధి అవుతోంది. తన పాండిత్యాన్ని భార్యా పిల్లల ముందు మహా చక్కగా ప్రదర్శిస్తూ వుంటారు.

తండ్రీ పిల్లలు లేచిం తర్వాత రఘు వెళ్లి కూర్చున్నాడు. అతను తల్లితో తన కష్టసుఖాల్ని గురించి చెప్పుకొనే సమయం యిదే! ఆ రోజు తన పరిస్థితిని గురించి ఎక్కువగా ఆలోచించాడు. అంచేత మాట్లాడకుండా భోజనం చేస్తున్నాడు.

'అదేదో కోర్సన్నావే! దానికి ఏమీ రాలేదా?' అన్నదామె.

'అదే చూస్తున్నానమ్మా. దానికి సెలెక్టవుతే నెలకు నలభై రూపాయలు స్టయిఫండ్ ఇస్తారు. మరోఇరవై పంపితే కాని సరిపోదు. నాన్నగారు ఒప్పుకుంటారా? ఆయన నన్ను ఏదో విధంగా వదిలించుకొంటే చాల్నను కొంటున్నారు. నేను...ఈ తిట్లన్నీ తినలేనమ్మా! ఆయన కిష్టం లేకపోతే నామీద ఒక పెద్ద బండపడేసి పారిపొమ్మను...'

ఆమె నిర్విణ్ణురాలై చూసింది. రఘు కళ్ళనుండి బొటబొట కన్నీటిబొట్లు రాలాయి.

* * *

'మీరు సుబ్బారాయుడి గారితోనైనా మాట్లాడండి. వాడు చెడిపోతున్నాడు. ఊరికే ఆలోచించి ఆలోచించి చిక్కిపోతున్నాడు. వాడికి పని రాక పోవటమంతా వాడితప్పు గానే మీరు హింసించేస్తున్నారు.'

ఆయన ఒక్క మూలుగు మూలిగి వూరుకొన్నారు.

'మీకు వాడు బ్రతికి బాగుపడటమే ఇష్టమైతే, వెళ్ళి మాట్లాడండి. మీకు నిజంగా వాడు చెడిపోవడమే మంచి దనిపిస్తే...మీ యిష్టం' అన్నదామె చాలా సేపటి తర్వాత.

ఇలాంటి ప్రస్తావన ఆ తర్వాత రెండు రోజుల్లోనూ పెక్కుసార్లు తెచ్చింది. చివరికి వెంకట్రావుగారు వెళ్ళి మంత్రి గారిని కలుసుకోవడానికి నిర్ణయించారు.

* * *

తండ్రిని రైలెక్కించి ఇంటికొచ్చాడు రఘు. పోస్ట్‌మేన్ ఒక కార్డు తెచ్చియిచ్చాడు. అది పెళ్ళి విషయమై వధువు తండ్రి రాసినది! చదివి మడిచి జేబులో వుంచుకొన్నాడు.

మర్నాడు మరో కవరు వచ్చింది. కవరుచించి ఎగిరి గెంతబోయి వూరుకొన్నాడు.

'ఏమిటలా చూస్తూ వుండిపోయావ్. ఎక్కణ్నుంచి?' అన్నది సుభద్రమ్మ.

'ఆ కోర్సన్నానే...దానికి సీటొచ్చింది. వెళ్లి చేరడానికి వారం రోజులే వైముంది' అన్నాడు రఘు.

'మీనాన్నగా రేమంటారో చూడాలి' అందామె.

'ఆయనేమంటారో నేనే చెప్తాను. ఈ కోర్సుకు వెళ్ళొద్దనే అంటారాయన. మళ్ళీ నామీద పెట్టుబడి పెట్టడం ఆయన కిష్టంలేదు. చేసిన అప్పులు తీరుతాయో లేదోనని ఇప్పటికే బెంగపడి పోతున్నారు. ఆయన పొరబాటున కూడా పెద్దమనిషి అయిన వాడి దగ్గర అప్పుచేయ లేదు. వెంకట సుబ్బయ్య దగ్గర తెచ్చిన ఆ వెయ్యిరూపాయలూ, మూడువేలై కూర్చుంది. ఒక ఇంగ్లీషు కథలో, రాత్రి పడేసిన బీన్సు గింజ, ఉదయాని కల్లా, ఆకాశమెత్తున పెరిగిపోతుంది. అట్లా పెరిగిపోయిందీ అప్పు...!'

రఘు ఇంకా మాట్లాడే వాడే! అలా మాట్లాడటం అతనికి కొట్టిన పిండి.

'సరేగానీ భోజనం చేసి మీ మామయ్యదగ్గరకు వెళ్ళిరా! ఆయనేమంటారో అడిగిరా' అంది.

'ఎవరు ఏ మామయ్య? ... ఆయనా...'

రఘు ధోరణి ఆమె తెలుసుకొంది.

'ఇప్పుడు ఆయనమీద దుమ్మెత్తిపోయకు ...మన పని కావాలి' అన్నది. రఘు వూరు కొన్నాడు.

* * *

వెంకట్రావుగారు మంత్రి సుబ్బారాయుడిగారి భవనం సమీపించారు. ఆయనకు ఒకటే అనుమానం — సుబ్బారాయుడు తనను ముందులా ఆదరంతో చూస్తారో చూడరో అని! ఇట్లా అనుమానించడానికి కారణంకూడా వుంది. మంత్రయినందుకు అభినందిస్తూ టెలిగ్రామిస్తే అందుకు జవాబు

రాలేదు. అదే సుబ్బరామయ్య ఒక కార్డుముక్క రాస్తే దానికాయన కృతజ్ఞత తెలుపుతూ ఉత్తరం రాశాడు.

సుబ్బారాయుడిగారి భార్య సరోజినీదేవిగారికి తనంటే చాలాగౌరవం. తను ఎప్పుడు వెళ్లినా ఆమె ఆదరంతో ఆతిథ్యమిచ్చేది. అయినా అప్పటి విషయంవేరు! ఇప్పుడు మంత్రి గారి సతీమణిగా ఆమె హోదా పెరిగింది. సహజంగా ఆ నిక్కూనీలుగూ, డాబూ దర్పం, అలవడి వుంటాయి. నిజంగానే ఆమె ఇప్పుడు అట్లా మారివుంటే తానందుకు ఆశ్చర్యపడ దలచుకో లేదు. అది సహజం! తను మంత్రయితే, తనభార్యా అట్లానే అవుతుంది. నిరుద్యోగిగా వున్నప్పుడు, ఉద్యోగం వచ్చినతర్వాత, ప్రమోషన్ వచ్చినప్పుడు, తన భార్య ఎట్లా ఉండినదో, ఎట్లా మారుతూ వచ్చిందో ఆయన ఒకసారి జ్ఞాపకానికి తెచ్చుకొన్నారు.

ఒకవేళ సుబ్బారాయుడుగారు కూడా ముందులా చూడకపోతే, తను ఆశ్చర్యపడ దలుచుకో లేదు. తనకు ప్రమోషన్ వచ్చినప్పుడు, హఠాత్తుగా తన తోడివారంతా తన సబార్డినేట్స్, అయ్యారని గర్వించాడు. ఆ రోజు సుబ్బారావు కాఫీకి పిలిస్తే, వెధవది...హోటలు కెందుకని తర్వాత ప్యూన్‌చేత కాఫీ తెప్పించుకోలా!

ఆయనలా ఆలోచిస్తూ భవనం చేరుకొన్నారు. గేటు దగ్గర రెండు నిమిషాలు ఆగి లోపలికి చూస్తున్నారు. ఇంతలో గేటు దగ్గర కారాగడం, సుబ్బారాయుడుగారు విష్ చేయడం, కారు లోపలికి వెళ్ళడం, నిమిషంలో జరిగి పోయాయి.

కారు ననుసరించి లోపలికి నడిచి, వరండా ముందు

నిల్చున్నారు. సుబ్బారాయుడు గారితో ఐదారుగురు కారు లోంచి దిగారు.

'ఎప్పుడు రావటం?...ఏమిటి విశేషాలు?' అంటూనే వచ్చి చేయి పట్టుకొన్నారు సుబ్బారాయుడుగారు. ఆ వచ్చిన వాళ్ళు ఒక నిమిషం ఆగి వెంకట్రావు కేసిచూసి లోపలికి వెళ్ళి పోయారు. వెంకట్రావు వెంటనే ఏమీ చెప్పలేక పోయారు. ఏది ఎలా ఎక్కడ మాట్లాడాలో ఆయన ఆలోచించలేదు గానీ, మాట్లాడేముందు ఆలోచించి మరీ ఎఫెక్టివ్‌గా మాట్లాడాలని మాత్రం ముందే అనుకొన్నారు!

'సరే...తర్వాత మనం తీరుబడిగా మాట్లాడు కొందాం లే! రండి చెప్తాను' అని లోపలికి తీసుకువెళ్ళి ఒక గది చూపించారు.

'ఇక్కడ కూర్చుంటావూ కొంతసేపు! ఇదిగో వీళ్ళంతా వచ్చారు చూడండీ; వీళ్ళను పంపించేసరికి గంటన్నర సేపయినా పడుతుంది. మీ కేం తొందర లేదుగదా!' అన్నారు.

'నా కేం తొందర్లే! ఉంటాన్లే' అన్నారు వెంకట్రావు గారు.

'వస్తాను' అని వెళ్ళిపోయారు సుబ్బారాయుడుగారు.

వెంకట్రావు ఆ గదిలో ప్రవేశించి కూర్చున్నారు. అక్కడ కొన్నిపత్రిక లున్నాయి. వాటిలో ఏదీ ఆయన్ను ఆకర్షించ లేదు.

సుబ్బారాయుడుగారు మాట్లాడిన పద్ధతి ఆయన కేమీ నచ్చలేదు. ఆ కంఠంలో ఆదరం కనిపించలేదు. తనను ఒకసారి మీరంటాడు, మరోకసారి నువ్వంటాడు. ముందు ఏకవచన

ప్రయోగమే చేసేవాడు. ఇప్పుడు ఏమంటే ఏమనుకొంటారో ననే ఆదుర్దావల్ల, అలా మాట్లాడివుంటాడనిపించింది. ఆయనతో చాలా గొప్ప వాళ్లెవరో వెళ్ళారు. బహుశా ఇప్పుడు విందే మైనా వుందేమో! మంత్రన్న తర్వాత మహామహా వాళ్ళంతా ఆయనతో స్నేహం చేస్తారు: సుబ్బారాయుడు నిజానికి మంచి వాడే! లేకపోతే తనను ఈ మాత్రమైనా పలకరిస్తాడూ!

సుబ్బారాయుడితో ఏమేం మాట్లాడాలి? కొడుక్కు-ఉద్యోగం యిప్పించాలని అడగటం నా మర్యాదగా కనిపిస్తూవుంది. స్నేహమంటే స్నేహం. అంతేగానీ, అతణ్ని ఇలాంటి పనిచేయ మని చెప్పొచ్చా? ఆయన ఆదర్శవ్యక్తిగా ప్రవర్తించ వలసినవాడు. ఇలా గవర్నమెంటు ఎడ్మినిస్ట్రేషన్‌లో జోక్యం కలుగ జేసుకొని పక్షపాతంతో, రఘుకు ఉద్యోగం యిప్పించగలడా? తను అలా చేయమని అడగటం మంచిదా? కాదు కాదు. అవునవును! వెంకట్రావు ఇలా అవునవును, కాదు కాదని అనుకొంటూ చాలసేపు అక్కడే కదలకుండా వుండిపోయారు. అప్పుడు రాత్రి ఏడుగంటల ప్రాంతం.

తొమ్మిది సమీపిస్తూ వుండగా సుబ్బారాయుడుగా రొచ్చారు.

'అరెరే...క్షమించాలి. నేను నిన్ను మరిచిపోలేదుగానీ, వాళ్లతో మాట్లాడుతూ వుండిపోయాను. వాళ్లు ఎంతకూ కది లారుకారు. నువ్వింకా భోజనం చేయలేదనుకొంటాను. సరో జినికి నువ్వొచ్చావని ఇప్పుడే చెప్పాను. భోజనం చేసింతర్వాత మాట్లాడుకొందాం...లే' అన్నారు.

'భోజనానికేంలే'...అంటూనే లేచారు వెంకట్రావుగారు.

'ఎప్పుడొచ్చారన్నయ్యా, ఒదినా పిల్లలూ కులాసానా! ఆయన ఇప్పుడే చెప్పారు మీరొచ్చారని. రండి భోజనంచేసి, తర్వాత మాట్లాడుకొందాం' అని లోపలికి వెళ్ళిపోయింది సరోజినీదేవి.

వెంకట్రావుగారు డంగయి పోయారు. ఆమె తను మాట్లాడటానికి అవకాశమే ఇవ్వలేదు. ఏదో మర్యాదకోసం అడిగినట్లు అడిగి జవాబుకైనా ఎదురుచూడలేదేమి శ్రీరామ చంద్రా! అనుకొన్నారు!

కాళ్ళూ చేతులూ కడుక్కొని కూర్చున్నారు. సరోజినీ దేవి ఒక ప్రక్కగా కుర్చీలో కూర్చుంది.

భోజనం పూర్తిచేసి హాల్లోకి వచ్చారు. అక్కడ సుబ్బారాయుడు సోఫాలో కూర్చుని వున్నాడు. ప్రక్కగా ఒక చిన్న ఎత్తయినబల్ల, కుర్చీలు వున్నాయి. ఒక కుర్చీలో కూర్చున్నారు వెంకట్రావు. తాంబూలపళ్లెం దగ్గరకు జరిపాడు సుబ్బారాయుడు. తాంబూలం వేసుకొంటుండగా —

'ఏమిటి విశేషాలు! అంతా కులాసా కదా' అన్నారాయన.

'విశేషాలేమున్నాయి. ఇప్పట్లో కుటుంబ పరిస్థితి ఏమీ బాగాలేదు గానీ...' వెంకట్రావు తనిలా సంకోచించకుండా ఈ మాట చెప్పివేయ గలిగినందుకు ఆశ్చర్యపడ్డారు. సంతోషించారు కూడాను. కానీ ఆ తర్వాత ఏమీ చెప్పలేకపోయారు.

'లేకపోతే...కుటుంబ పరిస్థితి ఎప్పుడు చక్కబడుతుంది గానీ' అని వూరుకొన్నాడు సుబ్బారాయుడు.

తను వచ్చిన పనిని గురించి చెప్పడానికి మంచి అవకాశం దొరకలేదేనని, లోపల బాధపడుతున్నారు వెంకట్రావుగారు.

"'రేపుకూడా వుంటావు కదూ'' అన్నాడు సుబ్బారాయుడు.

'ఉంటాను' అని, వుండకేం జేస్తానూ అనుకొన్నారు వెంకట్రావు.

'ఏమైనా పనిమీద వచ్చావా. లేక మామీద దయ కలిగి ఇలా వచ్చావా?' అన్నారు మంత్రిగారు.

'ఒక చిన్నపని వుందనుకో...' అనే సరికి —

'రేపుచూద్దాంలే! బాగా అలసిపోయి వుంటావు. పడు కొంటే హాయిగా నిద్రొచ్చేస్తుందిలే! ఇక్కడే పడుకొంటావా?' అన్నారు.

'లేదు లేదు! బంధు వొకాయన వున్నాడులే. అక్కడికి వస్తానని చెప్పొచ్చాను' అన్నారు వెంకట్రావుగారు.

'సరే అయితే' అన్నాడాయన.

సెలవు తీసుకొని లేచేసరికి సరోజినీదేవి వచ్చింది. ఆమె రాత్రికి అక్కడే వుండొచ్చునన్నా వినకుండా వచ్చేశారు.

వాళ్ళు తనను అక్కడే వుండమంటారనిగానీ, భోజనానికి లేవమంటారనిగానీ, ఆయన ముందుగా వూహించలేదు. వాళ్ళను గురించి ఏ విషయమూ మంచిగా వూహించుకోలేదు మరి!

ఇప్పుడు వుండమనడంలో కూడా ఆయనకేమంత మంచి అభిప్రాయం కలగలేదు. న్యాయంగా తను అసలు ఇంకో చోటికి వెళ్తాడనే అభిప్రాయమే కలిగివుండకూడదు. ఇక్కడే వుంటాడు గదా అన్నట్లే మాట్లాడి వుండాలి.

'ఇక పడుకొంటారా! పడక డాబామీద వేయమం టారా, గదిలో పడుకొంటారా?' అనే ధోరణిలో అడిగి వుండాలి.

భోజనానికి పిలవడంలో కూడా ఆయన కేమంత ఔచిత్యం కనిపించలేదు. తను తిండికోసమే వచ్చినట్లు పిలిచారు. మాట వరసకైనా 'స్నానం చేస్తారా?' అని అడగలేదు ... ఇలాంటివే ఇంకా చాల చిన్న చిన్న అంశాలు ఆయన దృష్టికి వచ్చాయి.

'నేనేమిటి ఇలా ఆలోచిస్తున్నాను? సుబ్బారాయుడు కాబట్టి మంచివాడనిపించుకోవాలని, 'ఎక్కడ గర్విష్ఠి' అయాడని అనుకొంటాననే కావచ్చు, ఈమాత్రం ఆదరమైనా చూపించాడు. అయినా నేను ముందే అనుకోలేదూ! అందుకనేగా—ఎందుకైనా మంచిదని, 'వొరేయ్! నేను రాత్రికి పడుకోటానికి వచ్చినా రావచ్చు. సుబ్బారాయుడు నన్ను వదలడనుకో! నాకక్కడ పడుకోవటం మంచిదిగా కనిపించక పోతే, వచ్చేస్తాను.' అని సుబ్బారావుతో చెప్పొచ్చింది. మంచిపనేలే!' అనుకొన్నారు.

ఇలా ఆలోచిస్తూ సుబ్బారావుగది చేరుకొన్నా రాయన. సుబ్బారావు సెక్రటేరియట్‌లో పని చేస్తున్నాడు.

'నాకిప్పుడే తెలిసింది. మీ సుబ్బారాయుడిగారి డిపార్టుమెంటులో, ఇరవై ఖాళీలున్నాయండీ' అన్నాడు సుబ్బారావు.

'ఊఁహూ...ఇందాక చెప్పావు కాదే' అన్నారు.

'మంత్రిగారు చెప్పలేదూ?' అన్నాడు సుబ్బారావు. తననో క్షుద్రుడుగా జమకట్టి ఆ మాటన్నట్లనిపించిం దాయనకు. అంటే సుబ్బారాయుడితో తన స్నేహం బహు స్వల్పమైందన్న మాట. అందుకని—

"చెప్పారనుకో...నిద్రొస్తోందోయ్. నిద్ర నిద్ర!" అని విషయం మార్చేశారు. నిజాని కాయన కప్పుడు నిద్రరావడం

లేదు. సరిగ్గా తద్వ్యతిరేకమైన స్థితిలో వున్నారు.

* * *

ఉదయం లేచి సుబ్బారాయుడిగారి భవనానికి వెళ్లారు. ఆయన అప్పుడే గవర్నరుగారిని కలుసుకోడానికి వెళ్ళిపోయారని తెలిసింది. సాయంకాలం వరద ప్రాంతాల్లో పర్యటించడానికి, సతీ సమేతంగా బయలుదేరి వెళ్ళిపోతున్నారనికూడా తెలిసింది. వెళ్లి పోతున్నారు కాబట్టే తనను ఈ రోజు రమ్మన్నారేమోననే అనుమానం కలిగింది వెంకట్రావుకు. అయినా, ఈలోగా సరోజినీ దేవిగారిని కలుసువకోడం సబబుగా వుంటుందనుకొన్నారు. కొంచెం కష్టంమీదే అయినా అర్ధగంటలో ఆమెను చూడ గలిగారు. ఆమె చాల సంతోషంగా వుంది!

'వచ్చారా...రండి. కూర్చోండి' అని సోఫా చూపిం చింది. ఆయన తనువచ్చిన పనేమిటో సూటిగా చెప్పేశారు. ఆమె వినీవిననట్లు వూరుకొంది.

'మీరు ఆయనకు చెప్పి చేయించాలండీ' అన్నారు.

ఆమె 'అలానే' అన్నది.

వెంకట్రావుకు చాలా బాధ కలిగింది. ఆమె ముఖం చూస్తే, ఆమె తను చెప్తున్నమాటల్ని ఏ మాత్రమూ వినిపించు కొంటున్నట్లు లేదు. అయినా మొదలుపెట్టేశారు గనక, ఇక తను ఆపినా ఆగేలా లేదు. అందుకని చెప్పదలచిందంతా ఏదో విధంగా చెప్పేశానని తృప్తిపడి 'సెలవు' అంటూ లేచారు.

'అప్పుడే వెళ్ళి పోతున్నారేమిటి? భోజనంచేసి తర్వాత వెళ్ళొచ్చు లెండి' అన్నదామె.

'వీల్లేదండీ'

'సరే! వదినగారిని అడిగానని చెప్పండేం?' అన్నది.

భవనం నుంచి బయటికి నడుస్తూ—

'చెప్తాను! ఇంకా ఏమన్నావో కూడా చెప్తాన్లే! నీకూ కళ్ళు నెత్తిమీది కెక్కాయిలే' అనుకున్నారు.

'ఛీ ఛీ. నేనెంత చెడ్డవాణ్ణి. ఎంత చెడ్డతలంపు కలిగింది. ఆమె తప్పేముందని పాపం!'అనుకున్నారు మళ్ళీ వెంటనే.

ఆయన మరో ఐదు రోజులు సుబ్బారావుతో రాజధానిలో అక్కడికీ ఇక్కడికీ తిరుగుతూ ఉండిపోయారు.

* * *

స్టేషన్లో ఒక అమ్మాయి రఘును ఆకర్షించింది. ఆమె జానకి. కాబోయే అర్ధాంగి! అతనేమీ సంకోచించకుండా ఆమెదగ్గరకు వెళ్లాడు.

'ఈమె ప్రక్కకు తిరిగి సిగ్గుపడిందా...మరీ ఎక్కువ సిగు తెప్పించి చచ్చేలా చేస్తాను' అనుకొన్నాడు.

'మీరా!' అన్నదామె. ఆమె చుట్టూ ఎవరూలేరు. రఘుకు ఆశ్చర్య మేసింది.

'మీతో ఎవరూ లేరేం?' అన్నాడు.

'ఉన్నారు' అంది.

'ఎవరు ?'

'ఇంకెవరు? మీరే!'

ఇంతలో నలభై ఏళ్ళ పెద్దమనిషి—

'జానకీ! నీకు పళ్ళూ అవీ ఏమీ అక్కర్లేదూ' అంటూ వచ్చాడు.

'చిన్నాన్నా! ఎవరొచ్చారో చూడూ!' అని తలవంచు కొందామె.

రఘు ఆశ్చర్యంలో మునిగిపోతున్నాడు. ఈ అమ్మాయికి సిగ్గుబిడియాలు తక్కువ. కానీ ఆయనొచ్చేసరికి ఆమెను సిగ్గు తెరలు కమ్ముకొన్నయ్! తలవంచుకొంది. బెదురు చూపులు చూస్తూంది. ఇంతవరకు ఏమీ మాట్లాడనట్లే నటిస్తూవుంది.

"ఓ...మీరా! ఏమండీ రఘునాధంగారూ! కులాసా! నాన్నగారు, అందరూ కులాసాగా వున్నారు కదా!...మరేంలేదు. పండక్కు అమ్మాయిని మా వూరు తీసుకెళ్తున్నా. జానకి మా యింట్లోనే పెరిగి పెద్దదైందిలెండి. మా ఆవిడకు జానకంటే మహా...యిష్టం! అన్నట్లు మీకు ఉద్యోగమైందా? నా మాట విని హాయిగా పెళ్ళిచేసుకోండి. తర్వాత అన్నీ సమకూరుతాయి. నా మాటవిని ఇంతవరకు ఒక్కరూ చెడిపోలేదు. మా జానకి మీ యింట్లో కాలుపెట్టిందీ అంటే, మీకు ఉద్యోగం వచ్చి తీరుతుంది. దేవుని సాక్షిగా నేను సత్యం చెప్తున్నాను నమ్మండి! మా ఆవిడ కాపరానికి వచ్చిన ఏడు నా కన్నీ కష్టాలే. జానకిని ఇంటికి తెచ్చుకొన్న రోజున, ఆశ వదులుకొన్న ఒక ప్రోనోట్ తాలూకు రెండువేల రూపాయలు, ఆ ఉదయమే నా చేతికొచ్చాయి! ఒకొకరి జన్మనక్షత్రం అలా వుంటుంది. సత్యం చెప్తున్నాను. అంతే! ఇంతెందుకు మీకే తెలుస్తుందిలే!" అన్నాడాయన.

'సరేలెండి! మీకులాగే మాకూ తొందరగా వుందనుకోండి! అయినా పరిస్థితులు...' అంటూ ఆమెవేపు చూశాడు. ఆమె నవ్వుతోంది!

'సరే లెండి. మీ రన్నట్లు పెళ్ళయిపోతే మంచిదే లెండి. పెళ్ళికీ ఉద్యోగానికీ ముడిపెట్టడం అట్టే మంచిది కాదు.

నేను ఇంటికి వెళ్ళగానే మా నాన్నగారితో మాట్లాడి ఉత్తరం రాయిస్తాన్లెండి.' అన్నాడు రఘు.

'తెలివైనవారు. సత్యం చెప్తున్నాను. అలాగే చేయండి. మీరు బాగుపడుతారు. అరే విజిలేశారు. రైటైంది. వస్తావా అమ్మాయ్! ఏదీ...పదా'...

జానకి వస్తానన్నట్లు రఘును చూసి ముందుకు నడిచింది. వెళ్తూ ఒకసారి తిరిగి చూసింది. రఘు ఆమెకేసే చూస్తున్నాడు. ఆమె పెట్టెలో కూర్చుని ఒకసారి అతణ్ణి చూసి కళ్లు దించేసుకొంది.

* * *

వెంకట్రావుగారు ఊళ్లో అడుగుపెట్టేసరికి, మంత్రి సుబ్బారాయుడుగారు ఊళ్ళోనే వున్నట్లు తెలిసింది. ఇంటికివెళ్ళి స్నానంచేసి కాఫీ త్రాగి మంత్రిగారి బసకు బయలుదేరారు.

'ఇప్పుడనగా వచ్చారు. అప్పుడే ఏం తొందర! అక్కడికి అంతదూరం వెళ్ళినప్పుడు ఏమీ చేయనిది, ఇప్పుడేం చేస్తార్లే! అదేదో సీటొచ్చిందట. దానికి పంపేస్తే చదువుకొంటాడు. వాడికి ఇప్పట్నుంచీ ఎందుకండీ యీ వుద్యోగమూ, సంసారమూ ఇవన్నీను.?' అంది భార్య.

'నాకు నువ్వేమీ చెప్పక్కర్లేదు. ఇంకే విషయంలోనైనా నేను నీ మాట వింటాను గానీ, ఈ గొడవ మాత్రం నీకక్కర్లేదు?' అని వెళ్ళిపోయారు.

ఆమె విస్తుపోయింది.

సుబ్బారాయుడిగారి దర్శనం లభించింది. తనకోసమే ఎదురు చూస్తున్నట్లు చెప్పారు కూడాను.

"మరేం లేదు. మీా అబ్బాయి వున్నాడు కదూ! ఇంటర్ వరకు చదివాడను కొంటాను. ఇంకా పైకి చదివించ లేదూ?" అన్నారు.

'నీకు తెలియంది ... ఏముంది సుబ్బారాయుడూ! చదువంటే మాటలా? ఎక్కణ్ణుంచి తెస్తాను డబ్బు! ఇంట్లో యింకా చదివించాల్సిన పిల్లలున్నారు. పెళ్ళి కావలసిన ఆడపిల్లలున్నారు. సర్వం తెలిసినవాడివి. ఇవన్నీ నేను నీకు చెప్పాలా?'

'అంచేతనే, నామాట ఒకటి విను.'

'ఏమిటి?'

"మీా వాడికి ఒక పెళ్ళి సంబంధం చెప్తాను. ఆ పెళ్ళి ముందు జరిపించేద్దాం. తర్వాత మీా అబ్బాయిని బియ్యే చదివించే పూచీ నాది. అతనికి ఏ కాలేజీలో చదవాలనుంటే, ఆ కాలేజీలో చేర్పిస్తాను. అమ్మాయికి తండ్రి లేడు. తల్లివుంది. అమ్మాయి అట్టేచదువుకో లేదు. అక్షర జ్ఞానం మాత్రం వుంది. అయినా మీా వాడి చేతికొస్తే అత డామెను ఏమైనా చేయొచ్చు. స్త్రీ అంటే మెత్తని బంగారం ముద్దయ్యా! ఎలాంటి రకం బొమ్మ కావాలంటే, అలాంటి రకం బొమ్మను తయారు చేసుకోవచ్చు" అన్నారు!

ఒక మంత్రిగారికి ఇలాంటి అభిప్రాయం వుంటుందని ఆయన వూహించ లేదు.

"నేనేమీా చెప్పలేను. ఇంట్లో మాట్లాడి ఆ తర్వాత చెప్తాను!" అన్నారు వెంకట్రావుగారు.

"ఇలాంటివన్నీ, ఇంట్లో మాట్లాడి ప్రయోజన మేముంటుం దయ్యా? ఆడవాళ్ళకివన్నీ ఏం తెలుస్తాయి? కావలిస్తే మీ అబ్బాయితో మాట్లాడి అతణ్ణి సాయంకాలం నాదగ్గరకు తీసుకురా చెప్తాను" అన్నారు.

"సరే" అని ఆయన సెలవు తీసుకొని, ఇంటి ముఖం పట్టారు.

* * *

"సుబ్బారాయుడి దగ్గరకు వెళ్ళొచ్చారా? ఏమన్నాడు? నాకు తెలుసులే నాన్నా ఏమన్నాడో! ఆ సుందరమ్మ కూతుర్ని నేను పెళ్ళి చేసుకొంటే బియ్యే చదివిస్తానని వుంటాడు. వెనకటి కెవడో ఆ బావిలోపడి కాళ్ళు విరగ్గొట్టుకో, ఒక లడ్డూ యిస్తా నన్నాడట! ఆ పెళ్ళీ నాకొద్దు. ఆ చదువూ నా కొద్దు. మీరుకూడా ఇక నన్ను చదివించక్కర్లేదు. నేనిక మిమ్మల్నేమీ బాధ పెట్టను. ఇప్పుడే నాకో వుద్యోగమొచ్చింది. మీ సుబ్బారాయుడి డిపార్ట్మెంటులే. టెంపరరీ అయితే నేం? ఎప్పుడో పడేశాను ఒక అప్లికేషన్! అదిప్పుడు తగిలింది. ఇందులో త్వరగా ప్రమోషన్ వచ్చే అవకాశంకూడా వుంటుంది. సుబ్బారాయుడి కటాక్ష వీక్షణాలు సోకకపోతే మూడేళ్లలో మంచి ప్రమోషన్ వస్తుంది.

'అంత నీచానికి పాల్పడి చదువుకోవలసిన అవసరమేమీ మనకు లేదు నాన్నా! నాకు నచ్చినట్లు బ్రతికి శుద్ధ మూర్ఖుడనిపించు కొన్నా నాకు దిగుల్లేదు. నేను బ్రతికుండగానే చచ్చిన వాళ్ళలో కలిసిపోవడం మాత్రం నాకిష్టం లేదు. నేను 'జీవచ్ఛవం'కా దలచుకోలేదు! ఆత్మవంచన చేసుకొనేవాళ్ళు –

అవసరంకోసం ఒకరు చెప్పినట్లల్లా నడచుకొనేవాళ్ళు, స్నేహం కోసం, మర్యాదకోసం, మంచికోసం ఇంకా అనేక ప్రయోజనాల కోసం 'ఆత్మ'ను చంపేసేవాళ్ళు, ఆడినమాటలు అదేపనిగా తప్పేవాళ్లు - ఇంకా ఈ తరహా వ్యక్తులందరూ ఎప్పుడో చచ్చి పోయి, యింకా బ్రతికే వున్నామని తృప్తిపడే మూర్ఖ శిఖా మణులు నాన్నా !''

రఘు కళ్ళముందు, జానకి చిరునవ్వుతో పలకరించి మాయ మైంది. "నోర్ముయ్యరా ఇడియట్"అని మీది కొచ్చారాయన! భూమి కృంగి పోతోందనిపించింది వెంకట్రావుకు. తన కొడుకు డిగ్రీతో వున్న గోడమీది బోర్డు భగ్గుమని మండి పోతూవుండటాన్ని సుభద్రమ్మ చూడగలిగింది !